వంతెనల నిర్మాణాలు ఎప్పుడో?

- వాగుల ఉధృతికి తెగిన కల్వర్టులు
- ఏళ్లు గడుస్తున్నా చేపట్టని పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఎర్రవల్లి: మండలంలో పలు వాగులపై వంతెనలు, కల్వర్టులు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న వర్షాలకు సైతం వాగుల్లో నీళ్లు నిలబడి దాటలేని పరిస్థితి దీనికి తోడు వంతెన నిర్మాణాలు ఏళ్లతరబడి కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉధృతి ఎక్కువైతే వంతెనలు లేని కారణంగా ఊరు కూడ దాటలేని దుస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో ఒకవేళ ప్రాణాలకు తెగించి వాగును దాటేందుకు ప్రయతిస్తే ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆయా గ్రామాల్లో వాగులపై అవసరమైన చోట వంతెలనలు ఏర్పాటు చేయాలని నాయకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.


ఫిల్లర్ గుంతలకే పరిమితమైన ఆర్.గార్లపాడు పెద్దవాగు.

ఉమ్మడి ఇటిక్యాలలో పరిస్థితి ఇలా...

- ఆర్.గార్లపాడు పెద్దవాగుపై బిడ్జి నిర్మాణం ప్రారంభమై ఆరేండ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు వాగు ఉధృతి కారణంగా అత్యవసర సమయంలో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు వాగును దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాల బారిన పడ్డారు.
- ఎర్రవల్లి మండల పరిధిలోని ఆర్. గార్లపాడు, సాసనూలు, షేకుపల్లి గ్రామాల సమీపంలోని ఐదు పెద్దవాగులు వర్షాకాలం ప్రారంభమైతే రోజుల తరబడి ఉధృతంగా ప్రవహిస్తాయి.
- ఇటిక్యాల మండల కేంద్రం నుంచి చాగాపురం, ఉదండాపురం గ్రామం నుంచి ఎస్సీ కాలనీ, ఉదండాపురం నుంచి సాతర్లకు వెళ్లే దారిలో ఉన్న నాలుగు వాగులకు వంతెనలు లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు.


వాగు ఉధృతికి ధ్వంసమైన సాసనూలు కల్వర్టు


షేకుపల్లి దగ్గర వాగును దాటేందుకు ప్రయత్నిస్తున్న ప్రజలు(ఫైల్)

వాగులపై వంతెనలు నిర్మించాలి..



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లడానికి పలు వాగులపై వంతెనలు లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ముఖ్యంగా ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లే దారిలో నాలుగు వాగులు ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి వాగులపై త్వరితగతిన వంతెనలు నిర్మించాలి.

– బోయ రాజు, సాసనూలు

నత్తనడకన సాగుతున్న పనులు..



మా ఊరి సమీపంలోని పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మానాన్ని చేపట్టి ఆరేండ్లు పూర్తయింది. పనులు నత్తనడకన సాగుతుండటంతో నేటి వరకు పూర్తి కాలేదు. గతేడాది కురిసిన వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు కూడా పూర్తిగా వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. దీంతో చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–చిన్న వీరన్న, ఆర్. గార్లపాడు గ్రామం.

నివేదికలు అందజేశాం..

గార్లపాడు వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించి ఫిల్లర్ గుంతలు తీశాక వర్షాలు అధికంగా కురవడంతో వరదనీరు ఫిల్లర్ గుంతల్లో పారడం వల్ల పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఆయా గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు అధికంగా పొంగిపొర్లే వాగులపై వంతెనలు నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. అనుమతులు రాగానే టెండర్లు వేసి నిర్మాణ పనులను ప్రారంభిస్తాం.

– రాజేశ్వరి, ఆర్అండ్‌బీ ఏఈఈ, అలంపూర్

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

రాజోళి: మండలంలోని తుమ్మిళ్ల గ్రామంలో గురువారం అయ్యప్పస్వామి శరణుఘోషతో మార్మోగింది. గ్రామంలో అయ్యప్ప మాలధారులు స్థానిక అంజనేయ స్వామి ఆలయంలో ఇరుముడి ధరించారు. అంతకుముందు కర్నూల్, శాంతిగనర్ నుంచి వచ్చిన గురుస్వాములు హరి స్వామి, గజేంద్ర గౌడ్, ఉమామహేశ్వర్ యాదవ్, భాస్కర్‌రావ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, గణపతి పూజ, సంకల్ప పూజ తదిదర పూజలు నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో భక్తులు పారవశ్యంలో మునిగిపోయారు. కార్యక్రమంలో శివస్వాములు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


తుమ్మిళ్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

ఆస్పత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి

గద్వాల : ప్రభుత్వాసుపత్రుల్లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నర్సింహ్మ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్వాల, ధరూరు మండలాల పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లోని సమస్యలు పరిష్కరించాలని శుక్ర, శనివారాల్లో ఆయా మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఛలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆందోళన కార్యక్రమాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, పరుశరాముడు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప్పేరు నర్సింహ

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

గద్వాల(మల్దకల్) : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ విద్యార్థులకు సూచించారు. గురువారం మల్దకల్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు క్రమం తప్పకుండా పంపాలన్నారు. ప్రతి రోజు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. బుధవారం రాత్రి మండలంలోని చర్లగార్లపాడు, మల్దకల్ గ్రామాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు రాత్రి వేళల్లో విద్యార్థుల ఇళ్లను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మల్దకల్ కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాకీర్‌హుసేన్ , రాజేశ్వర్‌రెడ్డి, ప్రదీప్, బలరాం తదితరులు పాల్గొన్నారు.


కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ సురేష్

ఎస్సీ వర్గీకరణ సాధనకు ఉద్యమిద్దాం


మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్

గద్వాల : ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు సంఘటితంగా ఉద్యమిద్దామని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ,బీ,సీ,డీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయడం లేదన్నారు. దీనిని నిరసిస్తూ ఈనెల 20న పాలమూరు యూనివర్సిటీలో ఉమ్మడి జిల్లా మహసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు జిల్లా అధ్యక్షులు, మండలాల అధ్యక్షులు, ఆయా కళాశాల కమిటీలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోగుల రాజేష్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు పరుశరాముడు, నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ రమేష్, పీయూ అధ్యక్షుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

గద్వాల(గట్టు) : మండలంలో నెలకొన్న పలు సమస్యలపై గురువారం మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉన్నట్లు పేర్కొన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయినట్లు తెలిపారు. చిన్నోనిపల్లె పునరావాస కేంద్రంలోని సమస్యలు పరిష్కరించాలని కోరారు. పునరావాస కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అసంపూర్తి పాఠశాల భవనాలు పూర్తి చేయించాలని, విద్యుత్ సమస్య తీర్చాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్

బండలాగుడు పోటీలు నిషేధం

గద్వాల(మల్దకల్) : మండల కేంద్రంలో జాతర సందర్భంగా నిర్వహించనున్న బండలాగుడు పోటీలు నిషేధించినట్లు మల్దకల్ ఎస్సై నందికర్ తెలిపారు. బండలాగుడు పోటీలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవన్నారు. పోటీలు ప్రోత్సహించినా, నిర్వాహణ చేసినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బండలాగుడు పోటీలు నిర్వహిస్తే ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



అయిజ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యర్తలు కృషి చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి శ్రేషావలి ఆచారి అన్నారు. అలంపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన ముసగంటి ప్రభాకర్‌ను గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన డీఈఓ


ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని స్పందన

గద్వాల(గట్టు) : గట్టు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని స్పందనను గురువారం జిల్లా కేంద్రంలో డీఈఓ అబ్దుల్‌ఘని ప్రశంసించారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో స్పందన జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో స్పందనకు ప్రశంసా పత్రంతో పాటు మెమెంటో అందజేసినట్లు ఎంఈఓ నల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయుడు పరుశరాం పాల్గొన్నారు.

మార్కెటింగ్‌పై విద్యార్థులకు అవగాహన

గద్వాల(మల్దకల్) : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఒకేషనల్ టూర్‌లో భాగంగా గురువారం అయిజ సింగిల్ విండో కార్యాలయంలో నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో సూపర్ మార్కెట్‌లో సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు కవిత, శిరీషలు విద్యార్థులకు బార్‌కోడ్ ఆఫర్, బిల్ టైపింగ్, సేల్స్ గురించి అవగాహన కల్పించారు. లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడింగ్ కంపెనీలో మ్యాన్ ఫ్యాక్చరింగ్‌పై వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సూపర్‌మార్కెట్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడికి సన్మానం

ఎర్రవల్లి: రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన ఎస్.ఎస్ దీపక్ ప్రజ్ఞను గురువారం అలంపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందించి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జోగుళాంబ ఆలయ డైరెక్టర్ జోగుల సరస్వతి రవి, యూత్ కాంగ్రెస్ నాయకులు పరుశ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

అయిజ: వ్యాపార రంగంతోపాటు ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహా సభ విద్యా కమిటీ చైర్మన్ శ్యామసుందర్ అన్నారు. గురువారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్యామసుందర్‌తోపాటు పలువురు ప్రముఖులు మాట్లాడారు. అయిజ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓబయ్య శెట్టి అదే విధంగా పట్టణ ప్రధాన కార్యదర్శిగా బచ్చు నాగరాజు, కోశాధికారిగా మెతుకు భరత్, గౌరవ అధ్యక్షుడిగా చిందుకూరి సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు గౌరీ ప్రసాద్, రాంబాబు, రమేష్, మణికంఠ, ఆర్‌కే రామకృష్ణ, వెంకటయ్య శెట్టి, గోపాల కృష్ణ, కిరణ్, సలహాదారులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులను ఆర్యవైశ్య సంఘం నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ శ్యామసుందర్

పాడితో ఆర్థికాభివృద్ధి

అలంపూర్ : గ్రామాల్లో వ్యవసాయ కుటుంబాలు పాడితోనే ఆర్థికంగా బలపడతాయని మండల పశువైద్య అధికారి శంకరయ్య అన్నారు. మండల పరిధిలోని సుల్తానాపురంలో పశువైద్య- పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భకోశ వ్యాధి నివారణ పరీక్షలు, గాలికుంటు నివారణ టీకాలు, సాధారణ పరీక్షలు చేశారు. అనంతరం రాయితీపై పాడి రైతులకు గడ్డి విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో ఉండవెల్లి మండల పశువైద్య అధికారిణి శిరీష, వెటర్నరీ అసిస్టెంట్లు శాంతి, యుగేందర్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ సూర్యారెడ్డి, సిబ్బంది ప్రకాష్, గోపాల మిత్రలు చిన్న స్వాములు, ప్రసాద్ గౌడ్, మల్లేష్, ప్రకాష్, లోకేష్ గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

బైకులు ఢీ.. ఇరువురికి గాయాలు

శాంతినగర్ : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడిన సంఘటన స్థానిక అంబేద్కర్ చౌరస్తా కోయిల్‌దిన్నె రోడ్డులో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. వడ్డేపల్లి మండలం కొంకలకు చెందిన వెంకటస్వామి భార్యతో కలిసి శాంతినగర్‌కు పని నిమిత్తం వెళ్లి రాత్రి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో జిల్లెడుదిన్నెకు చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వస్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో భార్య,భర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కలుషితం కాకుండా చూడటం కర్తవ్యం


అలంపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు


జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

గద్వాల : మట్టిని కలుషితం కాకుండా చూడడం మనిషి ప్రథమ కర్తవ్యమని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాష అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని నిర్వహించారు. మట్టి మూలాలను, వనరులను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో సమావేశం..

గద్వాల(కేటీదొడ్డి) : ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ శాఖ అధికారి సాజిద్ రెహమాన్ ఆధ్వర్యంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలుషితం లేని నేల కోసం చేయాల్సిన అంశాలు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రీతి సుధ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూసారాన్ని పరిరక్షించుకోండి..

అయిజ: రైతులు విచక్షణ రహితంగా రసాయన ఎరువులు వాడడం వలన పంటపొలాల్లో భూసారం తగ్గిపోయిందని, పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులతో భూసారాన్ని పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్ధన్ అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రం, వివిధ గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

భూసారంతోనే పంటల దిగుబడి..

అలంపూర్ : భూసారాన్ని పెంపొందిస్తేనే పంటల దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున్ రెడ్డి అన్నారు. అలంపూర్ మండల పరిధిలోని లింగనవాయిలో రైతులకు భూమి ప్రాధాన్యత తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ నీలిమ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుపై అవగాహన ..

ఉండవెల్లి: మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలోని రైతు వేదికలో ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా రైతులకు భూసార విధానాలు, పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ అనిత ఆధ్వర్యంలో పంటల సాగులో భూమి సారవంతం, ఏ నేలలో ఏ పంట సాగు చేయాలి అనే దానిపై వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయి, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలపై అవగాహన



ఉండవెల్లి: మండల పరిధిలోని పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలపై షీటీమ్ సిబ్బంది అవగాహన కల్పించారు. గురువారం బాల కార్మిక వ్యవస్థ, సైబర్ క్రైం, ర్యాగింగ్ తదితర చట్టాలు గురించి వివరించారుర. కార్యక్రమంలో షీటీం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

శాంతినగర్ : వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ రామాపురం రహదారి, అయిజ- రాయచూర్ రోడ్డు, పట్టణంలోని ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలను ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ప్రధాన కూడలిలో నాలుగు వైపుల వాహనాలు కనిపించే విధంగా, నేర పరిశోధన, నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మాచర్లలో శివస్వాముల అన్నదానం

గద్వాల(గట్టు) : మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో గురువారం శివమాల ధారులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీచెన్న కేశవస్వామి ఆలయంలో శివమాల ధారులు ప్రత్యేక పూజలు చేసి అనంతరం గ్రామస్తుల సహకారంతో దేవాలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అయిజ: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పీజీసీఆర్‌టీ నర్సింగ్ పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ఎస్ఓ చెన్న బసమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బీఎస్సీ నర్సింగ్ చేసిన మహిళలు కేజీబీవీలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహిళా శక్తి సంబరాలు

గద్వాల(ధరూరు): స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళా శక్తి సంబరాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఐకేపీ సీసీ జయరాజు తెలిపారు. మండల కేంద్రంతో పాటు ర్యాలంపాడు తదితర గ్రామాల్లోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేసి వివిధ అంశాలపై చర్చించారు. శ్రీనిధి రుణాలు, సీఐఎఫ్, ప్రమాద, సాధారణ బీమా తదితర పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలపై సభ్యులకు వివరించారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాల గురించి, ప్రతి నెల చెల్లిస్తున్న అప్పు డబ్బులు, పొదుపు డబ్బులకు సంబంధించిన విషయాలపై చర్చించారు. కార్యమంలో మండల మహిళా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి

గద్వాల(ధరూరు) : యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ధరూరు మండలం ర్యాలంపాడుకు చెందిన చిట్టెం పురుషోత్తంరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకం ఉంచిన నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్ సమీపంలో గురువారం నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి, పట్టుకున్నట్లు ఎస్ఐ రాణి తెలిపారు. ఈ సందర్భంగా వారిపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.9,190 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేకమైన చర్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంచినీటి విశిష్టతపై అవగాహన



ఇటిక్యాల: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రజా పాలన విజయోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య ఆతిథిగా మిషన్ భగీరథ ఏఈ వంశీకృష్ణ హజరై గ్రామీణ మంచినీటి వినియోగంతో పాటు నీటి విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నీటి సరఫరా వర్కర్లు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను క్లోరినేషన్ చేసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, జీపీ వర్కర్లు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.